డా॥ బి. వి. పట్టాభిరామ్ Ph. D.

# టర్నింగ్ పాయింట్

ఎమెస్కో

# ఇందులో


5. నామాట

9. టర్నింగ్ పాయింట్

17. మనసు కసరత్తుకు మైండ్ జిమ్

37. లైఫ్ మేనేజ్‌మెంట్

57. సెల్ఫ్ మేనేజ్‌మెంట్

79. ప్రభావాలకు దూరంగా ఉండే స్వభావం పెంచుకోవాలి.

89. లక్ష్యం ఏమిటి?

95. సక్సెస్ సీక్రెట్స్

121. అందంకాదు – అందమైన మనసుండాలి.

141. విజయానికి "మేజిక్"

*హస్తీ స్థూలతనుః సచాంకుశవశః కిం హస్తిమాత్రోంకుశో*
*దీపే ప్రజ్వలితే ప్రణశ్యతి తమః కిం దీపమాత్రం తమః ।*

*వజ్రేణాపి హతాః పతంతి గిరయః కిం వజ్రమాత్రో గిరిం*
*తేజో యస్య విరాజతే స బలవాన్ స్థూలేషు కః ప్రత్యయః ॥*

– చాణక్యనీతి XI-3

ఏనుగు చాలా పెద్దదే కాని చిన్న అంకుశం దాన్ని నియంత్రిస్తుంది. దీపం చిన్నదే కాని ఎంతో చీకటిని తొలగిస్తుంది. లక్ష్యం ఎంత పెద్దది అన్నది ప్రశ్నకాదు. లక్ష్యసాధనకు అవసరమైన దీక్ష చాలా ముఖ్యమైన అంశం. ఎవరు నిరంతర కృషితో విజయాన్ని సాధిస్తారో వారే తేజస్సుతో విరాజిల్లుతారు.

# టర్నింగ్ పాయింట్

సుప్రసిద్ధ గ్రీకు తత్త్వవేత్త సోక్రటీసును ఆయన శిష్యులు "స్వామీ! జ్ఞాని ఎవరూ?" అని ప్రశ్నించారు.

దానికి సోక్రటీసు "నేను అజ్ఞానిని" అన్నాడు.

"అయ్యా మీరే అజ్ఞాని అయితే మరి మా పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు శిష్యులు.

"నేను అజ్ఞానిని అనే విషయం నేను తెలుసుకున్నాను, కాని మీకు ఆ విషయం కూడా తెలియదు. మీరు అమాయకులు" అన్నాడు సోక్రటీసు.

సృష్టిలోని జ్ఞానమంతా ఏ ఒక్కరో పూర్తిగా పొందలేరు. బిందుమాత్ర జ్ఞానాన్ని మాత్రమే పొందుతారు అనేది సోక్రటీసు అభిప్రాయం.

మా కౌన్సిలింగ్ సెంటర్‌కి వచ్చేవారికి పదేపదే ఓ విషయాన్ని చెప్తుంటాను.

ఏ మనిషైనా విజయవంతం కావడానికి, ఆనందమయ జీవితం సాధించడానికి ప్రపంచంలోని జ్ఞానమంతా అవసరంలేదు.

**ఈ సృష్టిలో ఎవరూ అజ్ఞాని కాదు.**

ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి వైద్యం గురించి ఏమాత్రం తెలియకపోవచ్చు.

ఓ డాక్టర్‌కి కుండలు చేయడంలో కొంచెం కూడా ప్రావీణ్యం వుండకపోవచ్చు.

ఓ ఉపాధ్యాయుడు తాపీమేస్త్రిగా నైపుణ్యం పొందాలనికాని, ఓ తాపీమేస్త్రి మత ప్రవక్తలాగ బోధనలు చేయాలనిగాని ఏ ఒక్కరూ ఆశించరు. అలా ఆశించడం సరికాదు.

వివిధ విషయాల గురించి సాధారణ పరిజ్ఞానం మనకుండవచ్చు. ఉండటం అభిలషణీయంకూడా మనకు ఏ రంగంలో ఆసక్తి ఉందో అది మనం గుర్తించగలగాలి. దీన్నే కోర్ కాంపిటెన్సీ (Core Competency) అంటారు. అది చాలా ముఖ్యం.

అలాకాకుండా వివిధ రంగాలలో ప్రవేశించి దేన్నీ ఫలవంతంగా చేయలేనివారు అమాయకులు. వారినికూడా నేను అజ్ఞానులు అనను. వారికున్న జ్ఞానాన్ని గుర్తించలేని అమాయకులు అని మాత్రమే భావిస్తాను. మన కోర్ కాంపిటెన్సీని మనం గుర్తించగలగాలి. అది గుర్తించడమెట్లా? దానికి అయిదు అంచెల పద్ధతి వుంది.

1. మీతో మీరు చర్చించండి.
2. మీ బలాబలాలను బేరీజు వేసుకోండి.
3. మీలో వైరుధ్యాలని పరిష్కరించుకోండి.
4. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోండి.
5. మీ లక్ష్యం విషయంలో ఓ నిర్ణయానికి రండి.

ఈ అయిదంచెలలోను మీరు అనేక విషయాలని పరిగణనలోకి తీసుకోవాలి. మీ ఆలోచనలు, మీ బలాలు, బలహీనతలు, వివిధ సందర్భాలలో మీ చుట్టూ వున్నవారు మీ మీద వ్యక్తం చేసిన అభిప్రాయాలు వీటన్నిటిని స్థూలంగా ఓ కాగితంపై రాసుకుని, పైన చెప్పిన పద్ధతిలో మీ కోర్ కాంపిటెన్సీని గుర్తించడానికి సమాయత్తం కండి. అదే మీ జీవితంలో పెద్ద టర్నింగ్ పాయింట్.

**టర్నింగ్ పాయింట్ ...**

**టర్నింగ్ పాయింట్ జీవిత సరళిని మార్చి వేస్తుంది.**

**జీవిత గమ్యం అనూహ్యంగా మారిపోతుంది.**

**సామాన్యుడిని అసమాన ప్రతిభావంతుడిని చేస్తుంది.**

**అపజయాలను అవకాశాలుగా మార్చుతుంది.**

**అవమానాలను అద్వితీయ అవకాశాలుగా మార్చుతుంది.**

**"ఏమిటి?" అని ప్రశ్నించటం నేర్పుతుంది.**

**శిలను శిల్పంగా మలచగలుగుతుంది.**

*ఈ టర్నింగ్ పాయింట్ ఎలా లభిస్తుంది?*

*ఎవరికి లభిస్తుంది?*

*ఎక్కడ లభిస్తుంది?*

"అది లభించదు"

*"మరెలా?"*

"మీ... వ... ద్ద... నే... ఉం... ది"

*"నా దగ్గరా?"*

"అవును అక్షరాలా మీ వద్దనే ఉంది."

*"అది నాకెలా తెలుస్తుంది?"*

"ప్రస్తుతం ఉన్న మీ పరిస్థితే"

*"నాకేం బాగానే ఉన్నానుగా"*

"నిజమే! కానీ ఇంకా బాగా ఉండే అవకాశం ఉంది. నిజం చెప్పాలంటే ఇంతకన్నా వందరెట్లు అద్భుతాలు చేయగలిగే శక్తి మీలో ఉంది. చాలా చిన్న చిన్న వాటికి కంఫర్ట్ జోన్‌లోకి వెళ్ళిపోయి తృప్తిపడుతున్నారు.

*"నాకు అర్థం కాలేదు"*